Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)
స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు · స్థాపితం: 1930 · జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి
*Longest Living Newspaper in Telugu Journalism*

స్మైల్ సూపర్ స్పెషాలిటీ ... 30% ...
రమేష్‌రెడ్డినగర్, నెల్లూరు, ఫోన్ : 0861-2330949, 2344693

# జమీన్‌రైతు

కేర్ సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల
రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మరియు రిటైర్డ్ ఉద్యోగుల ట్రీట్‌మెంట్‌కు అయ్యే ఖర్చును తిరిగి పొందే (రీయింబర్స్‌మెంట్) సదుపాయం కలదు.
Asst. Professor Endodontics
ఫోన్ : 2303300

సంపుటి: 80 • సంచిక: 32 • 24-7-2009 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-



● శీనయ్యా,

## స్వంత ఇంటికి రావయ్యా...!

కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఎరక్కపోయి ఇరుక్కపోయాడు మొన్నకరోజు. శాసనసభ ఆవరణంలోని సిఎల్పీ ఆఫీసుకి వస్తుండిన శీనయ్యను తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు బీద రవిచంద్ర టిడిఎల్పీ ఆఫీసు దగ్గర ఎదురుపడి పలకరించాడు. సరదా సరదా సంభాషణ కాస్తా, రాజకీయ మలుపు తిరిగింది. మా పార్టీలోకి ఎప్పుడొస్తున్నావని రవిచంద్ర అందరి ముందు అడిగేసరికి బిత్తరపోయాడు శీనయ్య. టిడిపి ఎమ్మెల్యే ప్రసన్నకుమార రెడ్డిని కాంగ్రెస్‌వాళ్లు తీసుకొన్నారు కాబట్టి, నువ్వు పూర్వాశ్రమంలో తెలుగు దేశమీయుడవే కాబట్టి, ప్రసన్నను కాదని నీకక్కడ టిక్కెట్ రాదు కాబట్టి, స్వంత ఇంటికి వచ్చేయరాదా అని ఆహ్వానించాడు

**కొరవ 14వ పేజీలో**



### దేశం ఎమ్మెల్యేలతో

# వైఎస్ క్రీడ

## బాబు కాళ్లక్రింద గొయ్యి

అసెంబ్లీలో అధికారపక్షానికి ధీటుగా ప్రతిపక్షానికి సంఖ్యాబలం ఏర్పడడంతో రాజకీయ వ్యూహాలు, ఎత్తులు జిత్తులు మారిపోతున్నాయి. గత శాసనసభలో కాంగ్రెస్‌ది తిరుగులేని బలం. 45 మందితో తెలుగుదేశం మహా నీరసం. చంద్రబాబు ఎంత గొంతు




చించుకొని అరిచినా ఒక్క నవ్వుతో తేలికచేసేవాడు రాజశేఖర్‌రెడ్డి. కాంగ్రెస్‌సభ్యుల మూకబలం ముందు తెలుగుదేశం వాదన అరణ్య రోదనైపోయేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. అధికారపక్షానికి 156 మంది వుంటే, మొత్తం ప్రతిపక్షానికి 138 మంది ఎమ్మెల్యేలున్నారు. అందులో టిఆర్ఎస్, పిఆర్పి, స్వతంత్రులు కలిసి పాతికముప్పై మంది వరకు సిఎంతో లోపాయికారీ సంబంధాలు పెట్టుకొన్నారు కాబట్టి, ప్రభుత్వ స్థిరత్వానికి వచ్చిన ముప్పేమీ లేదు. కానీ వివాదాస్పద అంశాలలో ప్రతిపక్షం గొంతును మూగబోయేట్లు చేయడం మాత్రం సాధ్యంకాదు. అందువల్ల సభ గోలగోలగా మారుతుంది. ఇది ముఖ్యమంత్రికి సహ్యంకాని పరిస్థితి. ఇప్పటికిప్పుడు సంఖ్యాబలాన్ని తారుమారు చేయడం జరిగేది కాదు కాబట్టి, ఆయన ఒక తెలివైన వ్యూహం పన్నారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబును అయోమయంలోకి, ఆత్మరక్షణలోకి నెట్టి నైతికంగా దెబ్బతీసి, సభలో వారి రాద్ధాంతాలను సాధ్యమైనంత తగ్గించుకోవడమే ఆ వ్యూహం. అందుకోసం ఆయన తెలుగుదేశం ఎమ్మెల్యేల చేతనే బాబు కాళ్లక్రింద గోతులు త్రవ్వే క్రీడ తలపెడుతున్నాడు.

బడ్జెట్ సమావేశాలు జరిగే సమయంలో, ప్రభుత్వానికి ఇరకాటం కలిగే సమస్య తలెత్తినప్పుడల్లా, ఒక్కొక్క తెలుగుదేశం శాసనసభ్యుడు చంద్రబాబును ఏదో ఒక నెపం మీద తిట్టిపోసి, పార్టీ నుంచి సస్పెండ్ అయ్యే పరిస్థితి తెచ్చుకోవాలన్నది ఈ వ్యూహం లక్ష్యం. దీనివల్ల కీలక సమయాలలో తెలుగుదేశం పార్టీ తన పరువు కాపాడుకొనే ప్రయత్నంలో పడిపోయి, ప్రభుత్వం మీద దాడిని తగ్గించుకోవాల్సి వస్తుందన్నది ఆశ. ఇందుకోసం ఇప్పటికే ముగ్గురు టిడిపి ఎమ్మెల్యేలతో సిఎం ఆంతరంగికులు బేరం కుదుర్చుకొన్నారట. కర్నూలు జిల్లాకు చెందిన బాలనాగిరెడ్డి వారిలో ఒకరు. కాంట్రాక్ట్ పనులు, భూ పందేరాల వంటి ప్రలోభాలకు లొంగిన ఈ ఎమ్మెల్యేలు ఒక పథకం ప్రకారం తమ పార్టీ మీద తిరుగుబాటు చేస్తారు. టిడిఎల్పీ సమావేశంలో చంద్రబాబు ప్రసంగించేటప్పుడు గోల చేయడం, శాసనసభలో తెలుగుదేశం ఒక అంశం మీద విమర్శకు దిగితే, తాము లేచి ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడడం, చంద్రబాబును తిట్టిపోయడం వీరు చేయాల్సిన పని. శాసనసభ సమావేశాలు జరిగినన్నిరోజులు ఈ రాజకీయ నాటకాన్ని నడిపించడానికి రంగం సిద్ధం చేసిపెట్టాడు రాజశేఖర్‌రెడ్డి.

> చంద్రబాబును అయోమయంలోకి, ఆత్మరక్షణలోకి నెట్టి నైతికంగా దెబ్బతీయడమే వ్యూహం

ఈ వ్యవహారాన్ని చంద్రబాబు ఎట్లా ఎదుర్కోబోతాడో వేచి చూడాలి. ◆

## కార్టూన్ స్కేప్




పనిచేయమన్నది పార్టీకోసం.. మా ఇంట్లో కాదెహే!!

B.C.Aలో 'కృష్ణచైతన్య' క్లీన్‌స్వీప్!
B.C.A లో కృష్ణచైతన్యకు యూనివర్శిటీ పరిధిలో 1st, 2nd, 3rd స్థానాలతోపాటు 5th, 6th స్థానాలను కైవసం చేసుకుంది.
ఇటు B.Sc., B.Com., అటు 1st, 2nd, 3rd year ఇలా అన్నింటా టాపర్స్‌గా... కృష్ణచైతన్యం. నేడు B.C.A లోనూ టాపర్ - ఇదో అద్భుతం.



శిరీష 95% 409114043 1st
సాయికృష్ణ 94% 2nd
సాయిసింధు 92% 409114040 3rd
సారిక 91% 409114050 5th

కృష్ణచైతన్య
డిగ్రీ, పి.జి. M.C.A, M.B.A
కుసుమాలు, నెల్లూరు, సెల్: 9248748129

# కందిపప్పు కల్లోలం

రెండు వేళ్ల మధ్య పెట్టి గట్టిగా వత్తితే, పిండి పిండి అయ్యే కందిపప్పు మూడు రాష్ట్రాల ప్రజలను, ప్రభుత్వాలను అల్లాడిస్తున్నది. పాకిస్తాన్ తీవ్రవాదులకు, నక్సలైట్ల మందుపాతరలకు కూడా భయపడని ప్రభుత్వ నేతలు కందిపప్పు పేరు చెప్తే నిద్రలో లేచి కూర్చొంటున్నారు. పగటిపూట పీడ కలలు కంటున్నారు.

ఆంధ్ర, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలు మూడింటిలోనూ కందిపప్పు కల్లోలం తీవ్రంగా వుంది. అందుకు కారణం, దాని ధర చుక్కల్లోకి ఎక్కి కూర్చోవడం. ఆరు నెలల క్రితం కందిపప్పు కిలో ధర 35 నుంచి 40 రూపాయల లోపు వుండేది. ఇప్పుడు 100 రూపాయలు తాకుతున్నది. రానున్న ఒకటి రెండు నెలల్లో అది 120 దాటిపోయినా ఆశ్చర్యం లేదని అంచనా వేస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాల ప్రజలకు శాఖాహారంలో ఒకే ఒక ప్రొటీన్ పదార్థం కందిపప్పు. మనం తినే తతిమా శాఖాహార పదార్థాలు వేటిలోనూ కందిపప్పులో వున్నంత ప్రొటీన్ లేదు. కారం పులుసులలో కానీ, కూరగాయలతో చేసే కూరలతో కానీ, ఆకు కూరలలో కానీ ప్రొటీన్ వుండదు. ఉర్లగడ్డ, చామగడ్డ వంటి వాటిలో కూడా అధికంగా వుండేది పిండి పదార్థం మాత్రమే. బియ్యం సంగతి తెలిసిందే. పెసరపప్పులో కూడా ప్రొటీన్ ఎంతో కొంత వుంటుంది కానీ దాని వాడకం తక్కువ. ఈ మూడు రాష్ట్రాల ప్రజలు ఎక్కువగా వాడే ఆహార పదార్థం కందిపప్పు అనడంలో సందేహం లేదు. ఏ కూర చేయాలో తోచకపోతే ఆడవాళ్లు సులభంగా చేసేపని, ఇంత పప్పు ఉడకేసి సాంబారు కాచి పోయడం. చేపలు, కోడి కూర వంటివి తిననివారికి, వాటితో సమానంగా బలవర్ధక పోషక పదార్థాలను అందించే శక్తి కందిపప్పుకు వుంది. కానీ ఇప్పుడా పప్పు వండుకొని తినడం ఒక విలాసంగా మారిపోతున్నది. కోడి కూర కంటే ఖరీదై పోతున్నది. కిలో వంద రూపాయల ధర పెట్టి పేద వాళ్లే కాదు, ఒక మోస్తరు స్థితి కల్గిన మధ్యతరగతి వారు కూడా రోజూ కందిపప్పు తినడం జరగని పని. దాని ధరను ఆకాశం నుంచి క్రిందకు దించకుంటే, ప్రజలు దాని వాడకం మాని వేయకతప్పదు. ఇడ్లీ మునిగేట్లు సాంబారు పోసుకొని తింటే కానీ తృప్తిపడనివారి జిహ్వ చాపల్యం సంగతి పక్కనపెట్టి, శాఖాహారులు కందిపప్పు వాడకం మానివేస్తే వారి ఆరోగ్యం మీద దాని ప్రభావం ఎంతో తీవ్రంగా వుంటుందనడం నిజం. ప్రొటీన్ లోపం తలెత్తితే శరీరంలో వూహించని మార్పులు వస్తాయి. రోగనిరోధక శక్తి హరించుకపోతుంది.

అసలు ఈ సమస్య ఎందుకు వచ్చిందో ఎవరూ సరైన వివరణ ఇవ్వలేకపోతున్నారు. కర్నాటక రాష్ట్రంలో బీదర్, గుల్బర్గా జిల్లాలు మన రాష్ట్రంలోని కర్నూలు జిల్లా కందిపప్పు పంటకు ప్రసిద్ధి. అయితే ఇక్కడ పండే పంట ఈ మూడు రాష్ట్రాల అవసరాలు తీర్చడానికి చాలదు. బర్మా నుంచి పెద్ద మొత్తంలో పప్పు దిగుమతి చేసుకోవడం ద్వారా కొరత తీరుస్తున్నారు. పంట పండే ఈ ప్రాంతాలన్నిటిలో గత సంవత్సరం వానలు బాగానే పడ్డాయి. దిగుబడి లోపం లేదు. వినియోగం ఒక్కసారిగా పెరిగిపోయింది కూడా లేదు. కానీ ఆరు నెలల్లో ధర మాత్రం అనూహితంగా పెరిగిపోతున్నది. దానికి కారణం కనుక్కోవడం ప్రభుత్వాలకు చేత కావడం లేదు. కనీసం ఈ సమస్యకు పరిష్కారం కూడా ఎవరికీ తోచడం లేదు. చేతకాని వారి వలె నిలబడిపోయి చూస్తున్నారు అందరూ. మన ముఖ్యమంత్రి మాత్రం వచ్చే సంవత్సరం కందిపప్పు సాగు విస్తీర్ణాన్ని విస్తృతంగా పెంచి కొరత లేకుండా చూస్తానని హామీ ఇస్తున్నాడు. కానీ అది చెప్పినంత సులువు కాదు. నూనె గింజలకు ఎన్నో ఏళ్ల నుంచి కొరత వుంది. వాటి సాగు విస్తీర్ణం పెంచడం ద్వారా దిగుమతులు లేకుండా చేయాలని ప్రభుత్వం గత రెండు దశాబ్దాలుగా కష్టపడుతున్నది. కానీ ఇప్పటివరకు ఆ విషయంలో సాధించిన ప్రగతి శూన్యం. ఇరవయ్యేళ్లలో జరగని పని. ఒక్క సంవత్సరంలో తీరుస్తానని చెప్పడం అంటే, జనం కళ్లనీళ్లు తుడిచే ప్రయత్నం మాత్రమే.

ఈ సమస్యను పరిష్కరించడంలో అలసత్వం వహిస్తే ప్రభుత్వాలు చాలా పెద్ద మూల్యమే చెల్లించుకోవాల్సి వస్తుంది.

## జనవాణి

### ఆరోగ్యమంత్రి అసంబద్ధ ప్రేలాపనలు!

ఆలస్యంగా వివాహమాడండి. రాత్రి వేళల్లో బుల్లి తెరను వీక్షిస్తూ వుండండి. దీనికోసమైనా అన్ని గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తాం. వెలుతురు లేనప్పుడు ప్రజలు సృష్టికార్యంలో నిమగ్నులవుతారు. ఈ మాటలన్నీ ఎవరోకాదు కేంద్ర ఆరోగ్యమంత్రి గులామ్ నబీ అజాద్ చెప్పినవి. పవిత్రమైన వివాహ బంధం ఫలవంతం చెంది సంతానం కలగడాన్ని అదృష్టంగా భావించే భారతజాతిని వుద్దేశించి పలకవలసిన మాటలా ఇవి? జాతి సంస్కృతిని పరోక్షంగా అవమానపరచి, భార్యాభర్తల పవిత్ర సంగమాన్ని హేళన పరిచే వ్యాఖ్యలను మంత్రి తక్షణం ఉపసంహరించుకోవాలి. జాతికి క్షమాపణలు చెప్పాలి.

హైదరాబాద్ ప్రొఫెసర్ నాగరాజారావు

### తత్కాల్ కోటా తగ్గించండి!

దక్షిణ మధ్య రైల్వే బోర్డు రైళ్లలో తత్కాల్ కోటాను 30శాతానికి పెంచి ఆదాయం పెంచుకొన్నారు. ఇతర జోన్‌లలో ఇది పది శాతం మాత్రమే వుంది. దీనివల్ల సీనియర్ సిటిజన్స్‌కి లోయర్ బెర్తులు దొరకడం లేదు. ఈ విషయాన్ని గ్రహించి తత్కాల్ కోటాను 10శాతానికి తగ్గిస్తే సాధారణ ప్రయాణీకులతో పాటు సీనియర్ సిటిజన్లకు స్వాంతన చేకూరుతుంది. రైల్వేశాఖ తమ ఆదాయమే కాదు ప్రయాణీకుల వసతిని కూడా చూడాలి. పార్లమెంట్ సభ్యులు స్పందించాలి.

హైదరాబాద్ టివికె.రెడ్డి

కొరవ 14వ పేజీ

## 70 ఏళ్ల క్రితం ఈవారం

28-7-1939
పేజీలు : 20 వెల: అణా

### అల్లీపురంలో వీధులు చిమ్ముట!

నెల్లూరు గవర్నమెంటు ట్రయినింగ్ స్కూలులో సోషల్ లీగు సంస్థ యొకటి ఏర్పడి వుంది.

జిల్లా అధికారులు జిల్లా కలెక్టరు, పోలీసు సూపరింటెండెంట్, విద్యాశాఖాధికారి, జిల్లా హెల్త్ ఆఫీసరు, అగ్రికల్చరల్ అసిస్టెంటు డైరెక్టరు, జిల్లాడాక్టరు, యింపీరియల్ బ్యాంకి ఏజెంటు, శాసనసభ్యులు బత్తిన పెరుమాళ్ల నాయుడు, కమతం షణ్ముగం గారలు, జిల్లా బోర్డు ప్రెసిడెంట్ వంగల్లు కోదండరామిరెడ్డిగారు, తూములూరు పద్మనాభయ్య, రాళ్లపల్లి వెంకయ్య, సోషలులీగువారు అందరును కారులలోను బస్సులలోను 22తేదిన ఉదయం ఏడు గంటలకు అల్లీపురం గ్రామానికి చేరుకొనిరి.

జిల్లా అధికారులు ఇడ్లీ, కాఫీ, భుజించి సబ్బులతో చేతులు కడుక్కోని, చేయి తగలని వేడినీరు, సోడాలు త్రాగి, పల్లెటూరు వారికి ఆరోగ్య పద్ధతులు బోధించడానికి పూనుకోవడం సాహసం. ఈ ఆఫీసర్లు పోయి పల్లెటూరు వారికి ఆరోగ్యముగా వుండమని బోధించడం గుడ్డుపోయి పిల్లను ఎక్కిరించినట్లయింది. పట్టణవాసులకన్నా పల్లెటూరువారు దీర్ఘకాలం జీవిస్తూ, యెక్కువ ఆరోగ్యవంతులుగానే యున్నారు. వీరి నవనాగరవు ఆరోగ్య సూత్రాలు గ్రామస్తులకు అవసరం లేదు.

#### చిరుతను చంపారు

28-4-39 తేది గూడూరురైతులు చెరువుకాల్వ అమిజీ నిమిత్తం కందలి దగ్గర పని జేయుచుండిరి. అక్కడంత అడవిగూడా లేదు. గుట్ట చెట్లు-

ఎద చిరుతపులి కనపడ్డది చుట్టూ ముట్టడి వేశారు. అది చెట్టెక్కి ఒక చెట్టు నుంచి మరొక చెట్టుకు లంఘిస్తుండింది. చివరకు తిప్పవరప్పాడు మల్లు బలరామిరెడ్డిగారు వచ్చి తుపాకీతో కాల్చారు, క్రింద పడ్డది. కానీ చావలేదు. రైతులే గొడ్డళ్లతో మొత్తి చంపారు.

## 50 ఏళ్ల క్రితం ఈవారం

24 - 7 - 1959
పేజీలు: 12 వెల: 0-3-0

### దొడ్ల సుబ్బారెడ్డి వదాన్యత

"దొడ్ల సుబ్బారెడ్డి, చెంచురామిరెడ్డి సోదరుల వదాన్యత; కేంద్రమంత్రి డాక్టరు బెజవాడగోపాలరెడ్డి గారి ఆశీర్వాదము; ఎసి సుబ్బారెడ్డి గారి ప్రోత్సాహము; ఆనం సంజీవరెడ్డి కృషి, నీలం సంజీవ రెడ్డి గారి సహాయం" వల్ల ఏర్పడిన మహమ్మదాపురం హైస్కూలుకు ఏ.సి. సుబ్బారెడ్డి గారు 20తేది ప్రారంభోత్సవం గావించారు.

ప్రస్తుతం స్కూలు గ్రామంలోని ఒక పాత భవనంలో ప్రారంభమైంది. గ్రామం బయట విశాలమైన అయిదెకరాల స్థలంలో, ప్రకృతి సౌందర్యం మధ్య, అందమైన భవనం నిర్మాణం కాగానే అచ్చటకు మారుతుంది.

అంతర్ రాష్ట్ర కాంట్రాక్టరు దొడ్ల సుబ్బారెడ్డి, వారి సోదరుడు చెంచురామిరెడ్డి గారలు; తమ తండ్రి స్వర్గీయ శేషారెడ్డి స్మృతిచిహ్నంగా, ఈ హైస్కూలును ఆ ప్రాంతానికి ప్రసాదిస్తున్నారు. వీరు హైస్కూలుకు 5 ఎకరాల స్థలాన్నిచ్చారు; ఫర్నిచరుకు 10వేల రూపాయలు డిపాజిటు జేశారు; భవన నిర్మాణానికి ఎంతపడితే అంత భరించుటకు సిద్ధంగా వున్నారు. అంటే వీరి దానం 50వేలకు మించుతుందన్న మాట. గాంధీజీ ధర్మకర్తృత్వ సిద్ధాంతమంటే యిదే. సంపన్నులు సంఘశ్రేయస్సుకు తమ సంపదను ఈవిధంగా వినియోగిం చాలనే పెద్దలు కోరుతున్నది గూడా. సుబ్బారెడ్డి సోదరుల వదాన్యత ప్రశంసనీయమైనది.

#### ప్రధాని కార్యక్రమం ఆగిపోయింది

ఎన్నడూ ఎక్కని రెడ్డి గుర్రాన్ని ఎక్కితే వెనక ముందు అయిందన్నట్లుగా వుంది. ప్రధాని జవహర్లాల్‌నెహ్రూ కార్యక్రమం ఆగిపోవడం, దొరకక దొరకక పాతికేళ్లకు నెలవుగా వారి కార్యక్రమం నెల్లూరుకు లభిస్తే, అదీ జరిగే అవకాశం లేకుండాపోయింది. వారికి అకస్మాత్తుగా జబ్బు చేసింది. నీరసంగా వున్నారు. అన్ని కార్యక్రమాలు రద్దు చేసుకొన్నారు.



తరచూ గొడవలు జరుగుతున్న నెల్లూరు కోటమిట్ట సెంటర్.

## రౌడీషీటర్లపై ఇక పోలీసు నిఘా!

పోలీసు రికార్డుల్లో నమోదైన రౌడీషీటర్ల కదలికలపై పూర్తిస్థాయి నిఘా వుంచి వారి నడవడికను ఎప్పటికప్పుడు కట్టడిచేసేందుకు పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకొంటోంది. ఇటీవల కోటమిట్ట ప్రాంతంలో జరిగిన ఇద్దరు రౌడీషీటర్ల హత్య తర్వాత పోలీసు యంత్రాంగం అప్రమత్తమయ్యింది. ఈ ప్రాంతంలో పోలీసు నిఘా ముమ్మరం చేశారు. రౌడీషీటర్ల మేళా ఏర్పాటు చేసేందుకు పోలీసులు యోచన చేస్తున్నారు. నెల్లూరు పోలీసు సబ్‌డివిజన్‌లో 190 మంది రౌడీషీటర్లు వుండగా వీరిలో 140 మంది నగరంలోనే వున్నారు. జెండావీధిలో గతంలో గొడవలకు కారణమైన షేక్ సిరాజ్, బాష, షమ్మిలలో పోలీసులు కౌన్సిలింగ్ ద్వారా మార్పు తీసుకొచ్చారు. వీరు గొడవలు మాని వివిధ వృత్తులలో స్థిరపడడంతో ఇటీవలే వీరిపై పోలీసులు రౌడీషీట్ తీసివేశారు. అయితే గత ఆరేడు నెలల్లో కోటమిట్ట, డైకస్‌రోడ్డు ప్రాంతాలలో చిన్న చిన్న రౌడీల బృందాలు తయారయ్యాయి. ఈ చిన్న రౌడీ బృందాల్లోని సభ్యులే గతమాసంలో యాసిన్ హత్యకు పాల్పడ్డారు. ఇక నుండి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసేందుకు రౌడీషీటర్లపై నిత్యం నిఘా వుంచడంతోపాటు ప్రతి ఆదివారం వీరు స్టేషన్‌కు హాజరయ్యేలా చూడాలని ప్రణాళిక రచించారు. పోలీసులు గట్టిగా పని చేస్తే రౌడీషీటర్లను అణచివేయడం పెద్ద కష్టం కాదు.



నెల్లూరు విఆర్‌సి వద్ద ట్రాఫిక్ పద్మవ్యూహం

## సిగ్నల్స్‌తో ఇక్కట్లు

నెల్లూరు నగరంలోని ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. రోజురోజుకు పెరిగిపోతున్న వాహనాలకు అనుగుణంగా రోడ్ల విస్తరణ చేయకపోవడం, వున్న రోడ్లపై ట్రాఫిక్ నడతకు బాధ్యత తీసుకొనేవారు లేకపోవడంతో గందరగోళంగా తయారైపోయింది. ఆత్మకూరు బస్టాండ్ నుంచి అయ్యప్పగుడి వరకు ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 5.30 నుంచి 8.30 వరకు ట్రాఫిక్ పిల్లిమొగ్గలేస్తుందనాలి. సిటీబస్సులు స్టాపింగ్ లలో మాత్రమే ఆగాలి. కాని ఎక్కడ జనం చెయ్యెత్తితే అవి అక్కడ ఆగిపోతున్నాయి. దీంతో వెనుక వచ్చిన వాహనాలు నిలబడిపోతాయి. వేల సంఖ్యలో వున్న ఆటోలూ అంతే. వెనుకవచ్చే వాహనానికి ఇబ్బంది లేకుండా వాహనాన్ని నిలపాలన్న కనీసపాటి ధర్మాన్ని పాటించరు. కొత్తగా నగరంలో ఏర్పాటుచేసిన సిగ్నలింగ్ వ్యవస్థ మూలంగా మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహం, విఆర్‌సి, రామలింగాపురం సెంటర్లలో సరికొత్త ట్రాఫిక్ చిక్కులొచ్చి పడుతున్నాయి. ట్రాఫిక్ విభాగంలో పోలీసులు డ్యూటీ కన్నా బాతాఖానీలకే ప్రాముఖ్య మిస్తున్నారన్న విమర్శ వుంది. దానికి కారణం నెలసరి లంచాలన్నది బహిరంగ రహస్యం. నగరంలో పార్కింగ్ స్థలాల గుర్తింపును కార్పొరేషన్ ఇంతవరకు పూర్తి చేయలేదు. రోడ్ల విస్తరణ ప్రక్రియ తూతూమంత్రంగా చేశారు. కొత్త పోలీసు అధికారులు వచ్చినప్పుడు నాలుగైదు రోజులు హడావుడి తప్ప నగరంలో ట్రాఫిక్‌ను సరిదిద్దను నిర్మాణాత్మక చర్యలే లేవు.

## సింహపురిలో చిమ్మ చీకట్లు

నగరంలో పలుచోట్ల అంధకారం అలుముకొని వుంటుంది. రాత్రివేళల్లో దీపాలు వెలగక చిమ్మచీకటి రాజ్యమేలుతుండడంతో వివిధ ప్రాంతాలలో తిరగాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. విద్యుత్‌శాఖకు నగరపాలక సంస్థ ప్రతినెల 16లక్షల రూపాయలు బిల్లుల రూపంలో చెల్లిస్తున్నా విద్యుత్ విభాగం నిర్లక్ష్యంతో చీకటి రాజ్యమేలుతోంది. నగరంలో 24వేలకుపైగా వీధిలైట్లు వున్నాయి. వీటిలో 16 హైమాస్ లైట్లు, ఎస్‌వి ల్యాంప్స్ 2200, ఎంవిల్యాంప్స్ 635, సెంట్రల్ లైట్లు 250, ట్యూబులైట్లు 22వేలు వుండగా చాలామటుకు కాలిపోయి వుంటున్నాయి. నగర పాలక సంస్థ విద్యుత్ విభాగంలో ఒక ఎంఇ, డిఇ, ఎఇ, లైటింగ్ సూపర్‌వైజర్, ఇన్‌చార్జి సూపర్‌వైజర్, 9 మంది హెల్పర్లు, 11 మంది టైమ్ స్కేల్ ఎంఎన్‌ఆర్‌లు, 13 మంది కాంట్రాక్ట్ వర్కర్లు, 30 మంది గౌరవ వేతనంపై పనిచేసేవారు వున్నా లైట్లు వెలుగుతున్నాయా లేదా అని పట్టించుకొనే నాథుడే లేదు. నెలల తరబడి వీధిలైట్లు వెలగకపోయినా పట్టించుకోవడం లేదు. మరొకవైపు కొన్ని ప్రాంతాలలో పట్టపగలు లైట్లు వెలుగుతున్నా ఆర్పే దిక్కులేదు. కాలిపోయిన లైట్ల స్థానంలో నాశిరకం లైట్లు తీసుకొనివచ్చి వేసి చేతులు దులుపుకొంటుండడంతో వేసిన నాలుగు రోజులకు అవి కాలిపోతుండడంతో చీకట్లో తిరగాల్సి వస్తోంది నగర ప్రజలు.

## పాత వంతెనలపై పెరిగిన ఒత్తిడి

నెల్లూరు నగరంలో ప్రధాన కాల్వలపై నిర్మించిన బ్రిడ్జిలు శిథిలమై కూలేందుకు సిద్ధంగా వున్నాయి. బ్రిటీష్ కాలంలో రాకపోకలకు అనువుగా వుండేందుకుగాను సర్వేపల్లి కాలువ, హరనాథపురం, మైపాడుగేటు సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన బ్రిడ్జిలు శిథిలావస్థకు చేరుకొని ఏ క్షణమైనా కూలిపోయేలా వున్నాయి. కాలం చెల్లిన ఈ బ్రిడ్జిలపై అధిక లోడ్‌తో లారీలు, భారీవాహనాలు తిరుగాడుతుండడంతో ఈ దుస్థితి దాపురించింది. ఆత్మకూరు బస్టాండు వద్ద సర్వేపల్లి కాలువపై నిర్మించిన వంతెనతోపాటు, హరనాథపురం తదితర ప్రాంతాలలో వుండేవన్నీ ఇదే పరిస్థితిలో వున్నా ఏ ఒక్క ప్రజాప్రతినిధి పట్టించుకోకపోవడంతో నానాటికీ శిథిలమై పోతున్నాయి. ప్రధాన కూడళ్లలో పలు ప్రాంతాలను కలుపుతూ వుండే ఈ వంతెనలను పునరుద్ధరించాలని, వీటిని పటిష్టపరచేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుకొంటున్నారు.

## కుక్కలగుంటవాసుల కష్టాలు!

పురుగులు, రంగుమారిన నీరు, దోమల దరువు, కుక్కలబెడద వెరసి కుక్కలగుంట ప్రాంతాన్ని నరకకూపం చేస్తున్నాయి. నగర పాలక సంస్థ కార్యాలయానికి ప్రక్కనగల ఈ ప్రాంత ప్రజలు నిత్యం సమస్యలతో సహవాసం చేయాల్సి వస్తోంది. కొళాయిల్లో వచ్చేనీరు రంగుమారడంతోపాటు చిన్న చిన్న పురుగులు, నలకలు వస్తుండడంతో ఆ నీటిని త్రాగాలంటేనే స్థానికంగా నివాసం వుండేవారు హడలిపోతున్నారు. మంచినీటి సమస్యకు తోడు దోమల బెడద పట్టిపీడిస్తోంది. చెత్తాచెదారం, మురుగునీటితో దోమల ఉత్పత్తికేంద్రంగా మారి రాత్రి వేళల్లో కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. వీటికితోడు కుక్కలగుంటలో ఎక్కడ చూసినా కుక్కలు స్వైరవిహారం చేస్తుండడంతో రోజూ ఎవరో ఒకరు కుక్కల బారినపడి ఆస్పత్రిపాలు కావాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ● హాస్టల్ భవనం నుంచి క్రిందపడ్డ విద్యార్థి!



విద్యార్థి మరణానికి కారకులైన స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం.

నెల్లూరులోని కార్పొరేట్ స్కూళ్లు వేలాది రూపాయలు ఫీజులుగా వసూలు చేయడం మినహా స్కూళ్లకు అనుబంధంగా నడిచే హాస్టళ్లలో కనీస సదుపాయాలు ఏర్పరచరనే విషయం ఓ విద్యార్థి పై అంతస్తు నుంచి క్రిందపడ్డాకగాని తెలియరాలేదు. నగరంలోని ప్రముఖ స్కూల్‌లోని హాస్టల్‌లో తొమ్మిదవ తరగతి చదివే విద్యార్థి 19తేదీ తోటి విద్యార్థులతో ఆడుకొంటూ కిటికీలకు గ్రిల్స్ లేకపోవడంతో జారి పైనుంచి క్రిందపడిపోయాడు. ఇతనిది బద్వేల్. ఇక్కడుంటే బాగా చదువుకొంటాడని ఈ స్కూల్‌లో వ్యయప్రయాసలకోర్చి మరీ తల్లితండ్రులు చేర్చారట. ఈ విద్యార్థికి రెండుకాళ్లు విరగడంతో శస్త్ర చికిత్స చేశారు. తలకు బలమైన గాయమైందంటున్నారు. ఈ సంఘటన జరిగాక స్కూళ్లలో ప్రాథమిక సౌకర్యాల ఏర్పాటు విషయమై విద్యార్థి సంఘాలు ఎస్ఎఫ్ఐ, ఎబివిపి ధర్నాలు నిర్వహించి, జిల్లా విద్యాశాఖాధికారి ఆంజనేయులును ఘొరావ్ చేశాయి.

# ధాన్యానికి రైతే ధర నిర్ణయించే రోజెప్పుడో!



నెల్లూరు పప్పులవీధిలో ధాన్యం దళారులు

**జిల్లాలో రైతులు పండించిన ధాన్యానికి సరైన గిట్టుబాటు ధరకోసం ఎదురుచూస్తున్నారు. వరికి మద్దతు ధర కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయి. దేశానికి వెన్నెముకగా పిలవబడే రైతుకు తాను పండించిన ధాన్యానికి మాత్రం న్యాయమైన గిట్టుబాటు ధర లభించడం లేదు. వ్యాపారులు, దళారులు జలగల్లా పట్టిపీడిస్తుంటారు రైతుల్ని. రైతుకు వ్యవసాయానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించి, దానికి వడ్డీలు వేసి పంట పండిన తర్వాత ఇచ్చిన సొమ్ముకు వరి ధాన్యాన్ని తీసుకెళ్తుంటారు వ్యాపారులు.**

రైతు పండించిన వరి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించలేని ప్రభుత్వం బయట మార్కెట్లలో బియ్యం ధర ఆకాశాన్నంటుతున్నా నియంత్రించలేక పోతోంది. రోజుకూలీ చేసుకొని జీవించే సామాన్య మానవుడు బియ్యం, నిత్యావసర సరుకులు కొని తినలేక విలవిలలాడుతున్నాడు. రైతులు పండించిన ధాన్యాన్ని ముందుగానే భారత ఆహార సంస్థ, పౌరసరఫరాలశాఖ కొనుగోలు చేస్తే దళారులు, వ్యాపారుల రంగప్రవేశం వుండదు. అయితే ఈ దిశగా పై శాఖలు రెండు కూడా ఎప్పుడూ ఎటువంటి ప్రయత్నాలు చేసిన సందర్భాలు కనిపించలేదు. వ్యాపారులు, దళారులు మాత్రం రైతు వరిధాన్యం ఇంటికి తీసుకెళ్లక ముందే పొలాల్లోనే కొనుగోలు చేసి గోడౌన్లకు తరలిస్తుంటారు.



ప్లాట్‌ఫారంపై ఎండబెట్టిన ధాన్యం

## సీజన్ అయ్యాక నిర్ణయాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వరిధాన్యం కొనుగోలుకు అనుమతులు లభించేనాటికి రైతుల వద్ద ధాన్యం నిల్వ లేకుండా పోతుంది. రైతుల నుంచి ముందుగా ధాన్యాన్ని కొనుగోలు చేసిన వ్యాపారులు, దళారులు గోడౌన్లలో నిల్వచేసి అధిక ధరలకు బియ్యం రూపంలో విక్రయించుకుంటూ, గోడౌన్లపై విజిలెన్స్ అధికారులు దాడులు చేసిన సమయంలో గోడౌన్లలో నిల్వ వుంచిన ధాన్యాన్ని రైతులకు చెందినదిగా చూపుతుంటారు. దళారులు, వ్యాపారులకు అనుకూలంగా వ్యవహరించే కొంతమంది రైతులకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలను అధికారులకు ధృవీకరణ కోసం చూపిస్తుంటారు. పాస్ పుస్తకాలు చూపించని ధాన్యాన్ని మాత్రం అక్రమ నిల్వలుగా నిర్ధారించి విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకొనే అధికారం వుంటుంది.

## రైసు మిల్లర్లు మోసగిస్తున్నారు

జిల్లా రైసు మిల్లర్లు కూడా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే విషయంలో గిట్టుబాటు ధర చెల్లించడం లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పౌరసరఫరాల శాఖకు రైస్‌మిల్లర్లు ప్రతి సంవత్సరం 50వేల టన్నుల వరకు కొని బియ్యాన్ని సరఫరా చేయాల్సి వుంటుంది. ఇందుకు పౌరసరఫరాలశాఖ కిలో బియ్యానికి 14 రూపాయలు చెల్లిస్తుంటుంది. అయితే రైస్‌మిల్లర్లు నాసిరకంగా వుండే బియ్యాన్ని మాత్రమే పౌరసరఫరాల శాఖకు సరఫరా చేస్తుంటారు. పౌరసరఫరాల శాఖ కొనుగోలు చేసిన బియ్యాన్ని మండల స్టాక్ పాయింట్లకు తరలించి అక్కడ నుంచి రేషన్‌షాపులకు సరఫరా, పంపిణీ చేయడం జరుగుతుంది.

రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరను దళారులు, వ్యాపారులు కలసి నిర్ణయిస్తుంటారు. ఇతర ఉత్పత్తులకు సంబంధిత కంపెనీగానీ, లేకుంటే వస్తువు తయారుచేసిన యజమానికానీ కనీస ధర నిర్ణయించి మార్కెట్లో విక్రయిస్తుంటారు. అయితే రైతులు ఎంతో వ్యయప్రయాసలకోర్చి వేల రూపాయల పెట్టుబడులు అప్పుతెచ్చి పండించిన ధాన్యానికి మాత్రం రైతు ధర నిర్ణయించలేక పోతున్నాడు. దళారులు, వ్యాపారుల మధ్య అన్నదాత నలిగిపోతున్నా రైతు ప్రభుత్వంగా ప్రకటించుకొనే అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఎవరుకూడా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

## జిల్లాలో తగ్గిన దిగుబడి

జిల్లాలో కొన్ని వ్యవసాయ భూములను రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలుచేసి ఇళ్ల ప్లాట్లుగా చేశారు. దీంతో వరిపంట దిగుబడి బాగా తగ్గిపోయింది. వున్న విస్తీర్ణంలో వరిపంటలు వేసినా రైతులకు సరైన గిట్టుబాటు ధర కూడా దక్కడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు పండించిన వరిపంట కోతకు రాకముందే సరైన గిట్టుబాటు ధర నిర్ణయించి భారత ఆహార సంస్థ, పౌరసరఫరాల శాఖలు కొనుగోలు చేసే విధంగా ఆదేశాలు జారీచేయాలని రైతులు, రైతు సంఘాల నాయకులు ప్రతి సంవత్సరం విజ్ఞప్తిచేస్తూనే వున్నా ప్రభుత్వాలు మాత్రం స్పందించక పోవడం విశేషం.

## అధికారుల వైఫల్యం

జిల్లాలో రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించి వారికి చేయూతనివ్వాల్సిన అధికారులు పూర్తిగా వైఫల్యం చెందుతున్నారు. అన్నదాతను ఆదుకోవాల్సిన వీరు దళారులు, వ్యాపారులకు అండగా వుంటూ రైతులను పట్టించుకోవడం మానేశారు. రైతుల నుంచి ధాన్యం దళారులు, వ్యాపారులు కొనుగోలు చేసే సమయంలో తూకంలో భారీస్థాయిలో మోసాలు జరుగుతుంటాయి. ధర తక్కువగా నిర్ణయించడం, ఆపై తూకంలో ఎక్కువ తీసుకోవడం వంటి చర్యలకు పాల్పడుతుంటారు. ఇటువంటి అక్రమాలను అరికట్టాల్సిన బాధ్యత అధికారులపై వుందన్న విషయం కూడా ఎప్పుడో మరచి పోయారు.

ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా దాదాపు రెండు లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ముందుగా వరినాట్లు వేసిన ప్రాంతాల్లో వరి కోతలు జరుగుతున్నాయి. వెనుకబడివేసిన ప్రాంతాలలో ఆగస్టు నెలలో వరికోతకు వచ్చే అవకాశం వుంది. తొలి పంటకు 'ఏ' గ్రేడ్ రకం 7,950 రూపాయలు, సాధారణ రకం ధాన్యం 7,480 రూపాయలు ధర పలికింది.

జిల్లాలో రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించే విషయమై రైతు సంఘాల ప్రతినిధులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్, జిల్లా అధికారుల అభిప్రాయాలు ఇస్తున్నాం చదవండి.

### కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలి



గత సంవత్సరం ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం వల్ల ఒక్క క్వింటాల్ ధాన్యం కూడా కొనుగోలు చేయలేక పోయారు. ఈ ఏడాదైనా వీటిని ముందే ఏర్పాటుచేయాలి. అలాగే రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ధర కల్పించాలి.

**చంద్ర రాజగోపాల్**
వ్యవసాయ కార్మిక సంఘం, నెల్లూరు.

### కమిటీ ఏర్పాటుచేస్తే బాగుంటుంది



రైతులు పండించిన వరి ధాన్యానికి సరైన గిట్టుబాటు ధర నిర్ణయించేందుకు జిల్లా స్థాయిలో రైతు, వ్యాపారి, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో జిల్లా అధికారులు ఒక కమిటీని ఏర్పాటుచేయాలి. ఈ కమిటీ ఆధ్వర్యంలో ధరలు నిర్ణయించే విధంగా చర్యలు తీసుకొంటే రైతులకు ఎటువంటి నష్టం వుండదు.

**సుబ్రహ్మణ్యం రెడ్డి**
రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, నెల్లూరు.

### చర్యలు తీసుకుంటాం



రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వపరంగా అన్ని చర్యలూ తీసుకొంటాం. ఇదే విషయంపై రైతు సంఘం నాయకులు వినతి పత్రాలు కూడా ఇచ్చారు. వరి ధాన్యం రకాలకు ఎటువంటి ధర నిర్ణయించాలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుంది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తగిన నిర్ణయం తీసుకొంటాం.

కె.రాంగోపాల్, జిల్లా కలెక్టర్.

## తహసిల్దార్ చేతివాటం

జిల్లాలోని కొందరు తహసిల్దార్లు తిమ్మిని బమ్మి చేయగల మహాముదుర్లు అన్న సంగతి తెలిసిందే. తాజాగా పదికోట్ల విలువగల భూములను గుట్టుచప్పుడు కాకుండా ఒక భూస్వామికి రిజిస్ట్రేషన్ చేయించిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. మనుబోలు మండలం అనుపల్లిపాడులో ఐదవ నెంబర్ జాతీయ రహదారికి ఆనుకొని కృష్ణపట్నం పోర్టుకు వెళ్లే మార్గంలో 10 కోట్లు విలువ చేసే ఎస్టేట్‌దారుల భూములను గౌస్‌మొయిద్దీన్ అనే అతనికి రిజిస్ట్రేషన్ చేసుకొనేందుకు వీలుగా తహశీల్దార్ సుశీల క్లియరెన్స్ ఇవ్వడంలో లక్షల రూపాయలు చేతులు మారాయని గగ్గోలుగా వుంది.

1960 సంవత్సరంలో ఈ గ్రామ ఎస్టేటుదారులు సర్వేనెంబర్లు 1,2,76,78లలో తమకు గల 52 ఎకరాల భూమిని అదే గ్రామానికి చెందిన తొమ్మిది కుటుంబాలకు చెందిన 28 మంది రైతులకు శాశ్వత కౌలు క్రింద సాగుకు భూదానం చేశారు. 1995లో నెల్లూరుకు చెందిన షేక్ గౌస్‌మొయిద్దీన్ రైతుల నుంచి 20 ఎకరాలు లీజుకు తీసుకొని సాగు చేసేవాడు.



దీనితోపాటు మిగిలిన భూములను ఫోర్జరీ చేసి రైతులు అమ్మినట్లుగా పత్రాలు సృష్టించాడు. లీజు గడువు ముగిసినా ఆయన భూములు స్వాధీనం చేయకపోవడంతో కౌలుదార్లకు అనుమానం వచ్చి 2009 మే నెలలో తహశీల్దార్‌కు వాస్తవాలు తెలియజేసి చర్యలు తీసుకోవాలని కోరారు. జూలై 17న ఆ భూములను రిజిస్ట్రేషన్ చేయకూడదని పత్రాలను రెవిన్యూ అధికారులు పెండింగ్‌లో పెట్టారు. ఈ సమయంలో ఇక్కడికి బదలీపై వచ్చిన తహశీల్దార్ సుశీలకు ఇది లాభసాటి వ్యాపారంగా కన్పించింది. ఇలాంటి విషయాల్లో ఆరితేరిన ఆమె ఆర్ఓఆర్‌యాక్టు క్రింద 13బి, 13సి ఫారాలిచ్చి 43.95 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేసుకొనేందుకు ఆక్రమణదారుకి క్లియరెన్సులిచ్చి కోటి రూపాయల మేర ముడుపులు దండుకొన్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ వ్యవహారమై వున్నతాధికారులు విచారణకు ఆదేశించాల్సి వుంది.



జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదివి టెన్త్‌లో అత్యధిక మార్కులు తెచ్చుకొన్న విద్యార్థులను సన్మానిస్తున్న జడ్పీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రాంగోపాల్, ఎస్పీ మల్లారెడ్డి, ఎమ్మెల్సీ దాచూరు రామిరెడ్డి, జడ్పీ సిఇఓ రామిరెడ్డి.



నెల్లూరులో జరిగిన రాష్ట్ర హోటళ్ల సంఘం సమావేశంలో మురళీకృష్ణ హోటల్ అధినేత గ్రోసు గోపాలయ్యను సన్మానిస్తున్న దృశ్యం.

## సందిగ్ధంలో కోవూరు టిడిపి నేతలు

కోవూరు నియోజకవర్గంలోని తెలుగుదేశం నాయకులు సందిగ్ధంలో పడ్డారు. అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ అభ్యర్థి నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విజయం సాధించారన్న సంతోషం కొద్దిరోజులకే ఆవిరికావడంతో ఈ పరిస్థితి నెలకొనింది. ప్రసన్న గెలిచిన నాలుగురోజులకే రాష్ట్రంలో తెలుగుదేశం విజయం సాధించకపోవడం, తిరిగి వైఎస్ ముఖ్యమంత్రి కావడంతో ఆయన వైఎస్‌ను కలిసి, టిడిపిని విమర్శించడం, సస్పెండ్ కావడంతో కాంగ్రెస్‌లో చేరతాడనే ఊహాగానాలు ఊపందుకొన్నాయి. ఈ పరిస్థితుల్లో బుచ్చి, కోవూరు, కొడవలూరు, విడవలూరు, ఇందుకూరుపేట మండలాల్లో బలమైన నాయకులు తమ దారి ఏమిటా అని ఆలోచనలో పడ్డారు. తెలుగుదేశంలో వుండాలా లేక ప్రసన్నతో పాటు కాంగ్రెస్‌కు అనుబంధంగా పనిచేసి నాలుగురాళ్లు వెనుకేసుకోవాలా అన్న సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. దీనికితోడు కోవూరు నియోజకవర్గానికి 300కోట్ల రూపాయల నిధులు వివిధ పనుల కోసం మంజూరు చేశారన్న వార్త ప్రసన్న అనుచరులలో ఆసక్తి రేపింది. మొత్తంమీద ఎటూ తేల్చుకోలేక మల్లగుల్లాలు పడుతున్నారు కోవూరు నియోజకవర్గ టిడిపి నాయకులు.

## బుచ్చి హాస్టళ్లలో పరిస్థితి దారుణం!

పేదల సంక్షేమం కోసం పాటుపడుతామని పదే పదే ప్రకటించే నేతలకు సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పట్టవు అనేందుకు బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని హాస్టల్ పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలే నిదర్శనం. మండలంలో మొత్తం 11 హాస్టళ్లు వుండగా వాటిలో మూడు హాస్టళ్లు పదవ తరగతి ప్రత్యేక సెంటర్లు కలిగి వున్నాయి. రేబాల, పెనుబల్లి, మినగల్లు, దామరమడుగు గ్రామాల్లోని హాస్టళ్లతో పాటు బుచ్చి పట్టణంలో 7 వున్నాయి. వీటిలో నాలుగు బాలికల హాస్టళ్లున్నాయి. చదువుకోవాల్సిన విద్యార్థులు హాస్టల్ పనుల్లో నిమగ్నమై వున్నారంటే హాస్టల్ సిబ్బంది పని తీరు అవగతమవుతుంది. మేట్రిన్‌లకు పనులు చేసిపెట్టడం, కూరగాయలు తేవడం, బట్టలు వుతకడం తదితర పనులను పిల్లలే చేస్తుంటారు. అసలే సౌకర్యాలలేమితో అష్టకష్టాలు పడుతున్న విద్యార్థులకు అదనపు పనులు చేయాల్సి రావడంతో పరీక్షా ఫలితాలలో వెనుకబడిపోతున్నారు. చాలీచాలని ఇరుకుగదులు, పెచ్చులూడి

కొరవ 14వ పేజీలో

## విషమైన బిస్కట్లు

బిస్కట్ల కంపెనీ చెడిపోయిన తమ ఉత్పత్తులను రోడ్డు ప్రక్కన పారవేయడంతో పిల్లలు అవి తిని ప్రాణాల మీదకు తెచ్చుకొన్న సంఘటన దగదర్తి మండలంలో జరిగింది. జాతీయ రహదారి ప్రక్కన ఉలవపాళ్ల వద్ద బిస్కట్లు తయారుచేసే బ్రిటానియా కంపెనీ పాత సరుకును లారీలలో తీసుకొనివచ్చి రోడ్డు ప్రక్కన పారేసి వెళ్లారు. బిస్కట్ ప్యాకెట్లను చూసిన స్థానికులు అవి చెడిపోయినవని తెలియక ఎగబడి గోతాలలో వాటిని తీసుకొనిపోయి తాము తినడమేగాక వారి పిల్లలకు ఆ బిస్కట్లు తినిపించడంతో అస్వస్థతకు గురయ్యారు. కాలం చెల్లిన వాటిని తినడం మూలంగా వాంతులు, విరోచనాలు కావడంతో ఆస్పత్రికి వెళ్లడంతో అసలు విషయం తెలుసుకొని ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. చెడిపోయిన సరుకును గుంటతీసి పూడ్చిపెట్టడమో, కాలవల్లో వేయడమో, తగలబెట్టడమో చేయాల్సి వుండగా ఆ కంపెనీ నిర్లక్ష్యం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## నిర్వీర్యమైన మ్యాక్స్

కొండనాలుకకు మందేస్తే ఉన్ననాలుక వూడినట్లుగా వుంది జిల్లాలోని మ్యాక్స్ సభ్యుల పరిస్థితి. 1985 సంవత్సరం అక్టోబర్ 30న మ్యూచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ (మ్యాక్స్)లను ప్రారంభించబడినాయి జిల్లాలో. అప్పటి రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా కోవూరు మండలం లేగుంటపాడు గ్రామంలో దీనిని ప్రారంభించారు. ఆ తర్వాత అన్ని మండలాల్లో ఈ సొసైటీ తన సేవలను అందించేది. సభ్యులకు వీటి ద్వారా రుణ సదుపాయం, ఇతర సౌకర్యాలు కల్పించారు. జిల్లావ్యాప్తంగా 46 మండలాల్లో 500 నుంచి 700కుపైగా పొదుపు గ్రూపులు వుండేవి. కొత్తగా ఇందిరాక్రాంతి పథకం (ఐకెపి) రావడంతో అందులోని వారికి వీటి ఫలాలు అందుతున్నాయి తప్పితే గతంలో వున్న మ్యాక్స్ సభ్యులకు ఎలాంటి ప్రయోజనం వుండడం లేదు. దీనికితోడు ప్రభుత్వం కొత్తగా ప్రకటించి అమలు చేస్తున్న అభయహస్తం పథకం క్రింద పెన్షన్ మ్యాక్స్ సభ్యులకు వర్తించదని అధికారులు చెబుతుండడంతో దిక్కుతోచని స్థితిలో వున్నారు సభ్యులు. ఐకెపిలో వున్న 60 సంవత్సరాల వయసు నిండిన మహిళలకు పెన్షన్ సౌకర్యం వుంటే, మొదటి నుంచి కష్టపడి పనిచేసిన మ్యాక్స్ సభ్యులకు ఈ పథకం వర్తించకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. అల్లూరు, కొడవలూరు, లేగుంటపాడు, ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, కొండాపురం, ఓజిలి, కోట, మర్రిపాడు, చిల్లకూరు, ముత్తుకూరు, కలిగిరి, కోవూరు తదితర మండలాల్లో నడుస్తున్న మ్యాక్స్ సభ్యులను ఆదుకోవాలని అభయహస్తం ద్వారా పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.



## నారాయణకు పవర్ ఫ్లూ

సిపిఐ రాష్ట్రకార్యదర్శి నారాయణకు పవర్‌ఫ్లూ పట్టుకుంది. హోంశాఖ మంత్రి తన అధికారాల్ని వినియోగించుకోకపోవడంవల్లే బ్లాక్ మార్కెటర్లు పెరిగి నిత్యావసర సరుకులు ఆకాశానికి అంటుతున్నాయన్నది నారాయణ అభిప్రాయం. తనకే గనక ఓ రెండు గంటలపాటు హోంమంత్రి పదవి ఇస్తే బ్లాక్ మార్కెటర్ల భరతం పట్టి ధరల్ని అమాంతంగా తగ్గిస్తానంటున్నాడు. ఆమధ్య వచ్చిన ఓ సినిమాలో హీరో ఒక రోజు ముఖ్యమంత్రి అయి టకటకలాడించేస్తాడు. నారాయణ కూడా ఈ సినిమా చూసి ప్రేరణ పొంది వుండొచ్చు. అయినా సినిమాకు నిజ జీవితానికి మధ్య తేడా తెలియని వాడేం కాదు నారాయణ. గత ఏడాది గాంధీ జయంతినాడు చికెన్ తిని వార్తల్లో ఎక్కాడు. ఇటీవలి ఎన్నికల్లో తెలుగుదేశం, ప్రజారాజ్యం పార్టీల మధ్య అధికార పంపిణీకి ఫిఫ్టీ ఫిఫ్టీ ప్రతిపాదన చేసి పతకా శీర్షికలకెక్కాడు. ఇలా ఎన్నికల తర్వాత సిపిఎం రాష్ట్ర కార్యదర్శి రాఘవులుకు మెడమీద తలలేదంటూ విరుచుకుపడ్డాడు. ఇప్పుడూ ఏదో విధంగా వార్తల్లో వుండటం నారాయణకు నోటితో పెట్టిన విద్య. ఇప్పుడు హోం మంత్రి పదవికి గాలం వేయడం కూడా అందులో భాగమేనంటున్నారు.

## టిఆర్ఎస్‌లో 'ఆషాఢం' బూచి



ఆషాఢమాసం కొత్త దంపతులకే కాదు. రాజకీయాలకు కూడా అడ్డొస్తోంది. టిఆర్ఎస్‌లో కెసిఆర్‌తో పాటు, ఆయనను వ్యతిరేకించే అసమ్మతీయులు కూడా ఆషాఢమాసం ఎప్పుడు వెళ్తుందా అని ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ఆ పార్టీలో అసమ్మతి దావానలంలా వుంది. చాలామంది టిఆర్ఎస్‌ను వదిలి కాంగ్రెస్‌లోకి చేరడానికి ఉత్సాహంగా వున్నారు. అయితే ఆషాఢంలో ఫిరాయిస్తే తమ రాజకీయ భవిష్యత్తు బాగుండదని వెనుకాడుతున్నారు. కాగా కెసిఆర్ కూడా రాజకీయంగా అడుగుతీసి అడుగు వెయ్యడానికి భయపడుతున్నాడు. అసమ్మతీయుల్ని పిలిచి బుజ్జగించడానికి, లేదా పార్టీ నుంచి ఉద్వాసన చెప్పడానికి ఆషాఢం అడ్డొచ్చి పడిందట. అందుకే పార్టీలో ఏం జరిగినా ఆషాఢం పోయేదాకా నోరుమెదపకూడదని భీష్మించుకున్నాడు. అయినా మన పిచ్చికానీ ఆషాఢం అంటూ కూర్చుంటే జరగాల్సింది జరక్కుండా ఆగుతుందా! మరోవైపు నుంచి కాంగ్రెస్ 'ఆకర్ష' పథకాన్ని చాపకింద నీరులా అమలుచేసుకుంటూ పోతోంది. ఆషాఢం తెర తొలగ్గానే కప్పగంతులే తరువాయి.

## లోక్‌సత్తా 'ఈల' పై గోల

వచ్చే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో లోక్‌సత్తాకు ఉమ్మడి గుర్తుగా 'ఈల'ను కేటాయించడం తెలుగుదేశం పార్టీకి తలనొప్పిగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో లోక్‌సత్తా వల్ల తెలుగుదేశం ఓట్లు విపరీతంగా చీలిపోయాయి. దీంతో నగరంలోని స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయకేతనాన్ని ఎగురవేసింది. వచ్చే గ్రేటర్ ఎన్నికల్లో లోక్‌సత్తాకు ఉమ్మడిగుర్తు కేటాయిస్తే దాని పరిస్థితి మరింత మెరుగవుతుంది. అంటే తెలుగుదేశం ఓట్లకు లోక్‌సత్తా పెద్ద ఎత్తున గండికొట్టే అవకాశముంది. అందుకే తెలుగుదేశం పార్టీ ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘానికి దీనిపై అభ్యంతరం తెలిపింది. ఆ పార్టీ మద్దతుదారుడు కోర్టులో వ్యాజ్యం కూడా వేశాడు. లోక్‌సత్తా అంటే తెలుగుదేశంకు భయంపట్టుకోవడం సహజమే అయినా "ఈల" మీద మరీ ఇంతగా 'గోల' చేయాలా? అన్నదే ప్రశ్న!!



కాంగ్రెస్ పార్టీకి పెద్ద చిక్కొచ్చిపడింది. ప్రభుత్వ పగ్గాలుచేపట్టి రెండు నెలలుగడిచాయో లేదో గ్రేటర్ హైదరాబాదు ఎన్నికలు ముంచుకొచ్చాయి. విజయోత్సాహంతో ముందుకు పోదామంటే కందిపప్పు ధర కాళ్లకు అడ్డుపడుతోంది. ఊహించని రీతిలో కిలో 90 రూపాయల మైలురాయిని దాటిన కందిపప్పు ధరను నిలువరించడం ఎలాగో ప్రభుత్వానికి అర్థంకావడంలేదు. ఇక తమవల్ల కాదనుకున్నాడో ఏమో కానీ ముఖ్యమంత్రి కూడా ఈ విషయంలో చేసేదేం లేదంటూ చేతులెత్తేశాడు. చంద్రబాబు మాత్రం 'కంది'పప్పును ఎన్నికల మంత్రంగా ఉపయోగిస్తున్నాడు.

## గ్రేటర్‌కు 'కంది' దెబ్బ

గతంలో కేంద్రంలో జనతా ప్రభుత్వం అధికారంలో వున్నప్పుడు ఇలాగే ఉల్లిపాయల ధర అకస్మాత్తుగా పెరిగిపోయింది. వెంటనే ఎన్నికలురావడం, ఇందిరాగాంధీ ఉల్లిపాయల ధరను అజెండాగా తీసుకొని ప్రచారం చేయడంతో 'జనతా' ప్రభుత్వం ఘోరంగా ఓడిపోయింది. ఇప్పుడు కందిపప్పు వల్ల తమకు అటువంటి ముప్పే పొంచివుందని కాంగీయులు నానాహైరానా పడుతున్నారు. అవసరమైతే విదేశాలనుంచైనా కందిపప్పును తెప్పించి గ్రేటర్ ఎన్నికల్లో పంచిపెట్టాలని ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించారు. ఫ్.... కందిపప్పా! మజాకానా!




## రఘువీరా మేఘ'మథనం'

మేఘమథనం అంటే వ్యవసాయ మంత్రి రఘువీరారెడ్డికి ఎంతో యిష్టం. ప్రతి యేడాది వర్షాకాలం ఎప్పుడొస్తుందా! ఎప్పుడు మేఘాల్ని మథిద్దామంటూ ఆయన ఎదురుచూస్తుంటాడు.

మంత్రిగారికి ఏమిటీ ఆసక్తి అనుకుంటున్నారా? మరేం లేదండీ కోట్లాది రూపాయల్ని మేఘమథనం పేరుతో కాంట్రాక్టు అప్పజెప్పవచ్చు. వర్షాలు పడినా, పడకపోయినా 'అనుకున్న పని'కాస్తా జరిగిపోతుంది. అన్నట్టు మేఘమథనం కాంట్రాక్టు కూడా మంత్రిగారి ఆశీస్సులున్న అగ్ని ఏవియేషన్ సంస్థకు మాత్రమే దక్కుతుంది. అదేమంటే వాళ్లు తక్కువ మొత్తానికి కోట్ చేశారంటూ మంత్రిగారు సమర్థిస్తుంటారు. అంతా బాగానే వుంది కానీ మేఘమథనం ముహూర్తంకూడా మంత్రిగారే నిర్ణయించడం వెనుక కూడా ఆంతర్యం వుందంటున్నారు. సముద్రంలో వాయుగుండం ఏర్పడి రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు పడుతున్నప్పుడు మేఘమథనం మొదలవుతుంది. సహజంగా కురిసిన వర్షాల లెక్కల్ని తమ ఘనతగా చూపించి బిల్లులు చేసుకుంటారు. వర్షం మాట ఎలావున్నా ప్రజాధనం మాత్రం మేఘాలపాలవుతోంది.






ఇదేదో సినిమా పేరనుకుంటే పప్పులో కాలేసినట్లే. రాష్ట్ర మహిళా, శిశుసంక్షేమశాఖ మంత్రి కొండా సురేఖ ఊతపదం ఇది. తన శాఖలో 'పని'కోసం వచ్చే వారికి సురేఖ 'మా ఆయనను కలవండి' అంటూ ఎంచక్కా చెబుతున్నారట. ఇదేమిటి? మంత్రిగారిని కలిస్తే ఆయనను కలవమనడం ఏమిటంటూ ఓ ఔత్సాహికుడు ఆరాతీశాడు. తీరా చూస్తే ఆయనగారేమో మెనూకార్డు ముందు పెడుతున్నాడట. అందులో 'పని'ని బట్టి రేట్లు వున్నాయట. ఇదేదో బాగానే వుంది. 'పని'కోసం ఎక్కేడగపా దిగే గడపా లేకుండా 'క్యాష్ ఎన్ క్యారీ' పద్ధతి బాగానే ఉందంటూ జనం పనులు చక్కబెట్టుకుంటున్నారు.

## ఎమ్మెస్సార్ కు 'చిరు' అభిమాని



సినీ నటులకే కాదు రాజకీయ నాయకులకు కూడా అభిమానులుంటారు. అయితే ఓ రాజకీయనాయకుడికి మెగాస్టార్ అంతటివాడు వీరాభిమాని కావడం మాత్రం నిజంగా విశేషమే. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎం. సత్యనారాయణ రావుకు చిరంజీవి అభిమానిగా మారిపోయాడు. ఇటీవల వివిధ రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమించిన జాబితాలో ఎమ్మెస్సార్ పేరు లేకపోవడం 'చిరు'కు చిర్రెత్తించింది. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుల్లో సీనియర్ అయిన ఎమ్మెస్సార్‌కు గవర్నర్ గిరి యిచ్చివుంటే బాగుండేదని 'చిరు' బహిరంగ ప్రకటన చేశాడు. దీంతో కాంగీయులంతా ముక్కుపై వేలేసుకున్నారు. ఇదేమిటి! కాంగ్రెస్ పార్టీలో పదవులు ఎవరికివ్వాలో కూడా 'చిరు' చెప్పడం వింతగా వుందని వారంతా చెవులు కొరుక్కుంటున్నారు. మొత్తానికి ఎమ్మెస్సార్‌కు కూడా ఓ వీరాభిమాని తయారయ్యాడన్న మాట!

# శుభాల శ్రావణమాసం



తెలుగు మాసాలలో అయిదవది శ్రావణ మాసం. ఈ మాసాన్ని వేదాల్లో 'నభస' అంటారు. విష్ణుమూర్తి నక్షత్రమైన శ్రవణంతో కలిసిన పూర్ణిమ కలది కాబట్టి ఈ మాసానికి శ్రావణమాసం అనే పేరు వచ్చింది. ఎంతో ఉత్కృష్టమైన ఈ మాసం లక్ష్మీదేవికి ఎంతో ప్రీతికరమైనది.

మనకున్న ఏడు వారాలలో కార్తీక మాసంలో సోమవారానికి, మార్గశిర మాసంలో గురువారానికి, మాఘమాసంలో ఆదివారానికి ప్రత్యేకతలు వున్నాయి. ఈ శ్రావణమాసంలో మూడు వారాలు ప్రత్యేకమైనవి. అవి మంగళ, శుక్ర, శనివారాలు. మంగళవారం నాడు కొత్తగా వివాహమైన వధువులు అమంగళ నాశనంకోసం మంగళగౌరీ వ్రతాన్ని ఆచరిస్తారు. మహిళలకు మంగళప్రదమైందీ, శుభదాయకమైందీ వరలక్ష్మీ వ్రతం. శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం నాడు ముత్తైదువలు భక్తిశ్రద్ధలతో ఈ వ్రతం చేసుకుంటారు. శ్రావణమాసంలోని ఈ శుక్రవారం చేసుకునే వరలక్ష్మీ వ్రతం తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే పర్వదినమని చెప్పుకోవచ్చు. భాగ్యదాయిని, సౌభాగ్య ప్రదాయిని అయిన వరలక్ష్మీ దేవిని మనం వరాలు కోరుకోవాలంటే ముందుగా ఆ దేవిని ప్రసన్నం చేసుకోవాలి. దానికి సంబంధించిందే ఈ వ్రతం. శనివారంనాడు వేంకటేశ్వరుని పూజిస్తారు.

శుభకార్యాలకు ఈ నెల అనువైనది. ఈ నెలలో గృహప్రవేశం చేస్తే సకల శుభాలు కలుగుతాయని పురాణాలు చెప్తున్నాయి. ఈ నెలలో పుట్టినవారు కూడా సమస్త జనులచే పూజింపబడతారని జ్యోతిషశాస్త్రం చెబుతుంది. అందుకనే ఈ మాసంలో జన్మించిన జగన్నాథుడైన శ్రీకృష్ణుడు సకల లోకారాధ్యుడైనాడు. అంతేకాక శ్రావణ పూర్ణిమ నాడు జన్మించిన సకల విద్యాధినాథుడైన హయగ్రీవుడు, వైఖానస ఆగమ ప్రవక్తైన విఖనస మహర్షి ప్రపూజనత్వాన్ని పొందారు.

ఈ నెలలోని పౌర్ణమికి ఎంతో ప్రాముఖ్యం ఉన్నది. ఈ పున్నమిని రాఖీ పూర్ణిమ అని, జంధ్యాల పౌర్ణమి అని అంటారు. ఈనాడు ద్విజులు (ఉపనయన అర్హత కలవారు) ఉపకర్మను ఆచరిస్తారు. వైదికమైన ఈ ఉపకర్మను శ్రేయస్సు కొరకు తప్పక ఆచరించాలని స్మృతులు చెప్తున్నాయి. సామాన్యులు రక్షాబంధన (రాఖీ) పండుగను సోదరసోదరీ ప్రేమకు ప్రతీకగా చేస్తారు. ఈ మాసంలో చేసే విష్ణు, లక్ష్మీ ఆరాధనలు విశేష ఫలితాలను ఇస్తాయి.

అంతేకాక ఈ మాసంలో నోములు, వ్రతాలు నోచుకునేవారు పేరంటాళ్ళకు నానబెట్టిన శనగలను వాయనంగా ఇస్తారు. మొలకెత్తిన ఈ శనగల్లో పోషక విలువలు పుష్కలంగా వుంటాయి. వాటితోపాటు విటమిన్ ఎ, విటమిన్ బి, విటమిన్ సి, విటమిన్ ఇ వుంటాయి. ఈ విధంగా శ్రావణమాసం ఆయురారోగ్య, ఐశ్వర్యాలు ప్రసాదిస్తుంది.

# జనార్దనరెడ్డి ఇంట చాన్నాళ్లకు సందడి!





ఒకప్పుడు నేదురుమల్లి జనార్దనరెడ్డి ఎక్కడుంటే అక్కడ రాజకీయ తిరునాళ్ళ వలె కన్పించేది. ఆయన ఇంట్లో ఎప్పుడూ ఏదో ఒక సందడి. నాయకుల రాకపోకల కోలాహలం. గత కొంత కాలంగా నిద్రాణంగా వుండిన ఆయన మొన్న 16వ తేది ఢిల్లీలో తన ఇంట్లో పెద్ద విందు రాజకీయం నెరపారు. చాన్నాళ్లకు ఆయన నుంచి పిలుపు అందిందన్న సంతోషంతో కాబోలు, పిలిచినవారందరూ హాజరు పట్టీలో సంతకం పెట్టారు. ఆ దృశ్యాలివీ.

విందుకు హాజరైన ముఖ్యులు – చింతామోహన్, మైసూరారెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, రాయపాటి సాంబశివరావు, దగ్గుపాటి వెంకటేశ్వరరావు, ఎం.వెంకయ్యనాయుడు, జెడి.శీలం, దగ్గుబాటి పురంధరేశ్వరి, మందా జగన్నాథం, తిక్కవరపు సుబ్బరామిరెడ్డి, దిగ్విజయ్ సింగ్, ఆస్కార్ ఫెర్నాండెజ్, అహ్మద్ పటేల్ వగైరాలున్నారు. అంతర్ చిత్రంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌తో వైఎస్.జగన్. రెండవ చిత్రంలో జయప్రద, అజారుద్దీన్, బొత్సా ఝాన్సీలతో జనార్దనరెడ్డి ముచ్చట్లు.




ప్రథమవర్ధంతి

మా ఇంటి మహాలక్ష్మి, మా హృదయాంతరాలలో నిరంతరం వెలిగే ధృవతార,
మమ్మల్ని తన గుండెలలో దాచుకొన్న ప్రేమమూర్తి, మా అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన
మా తల్లి శ్రీమతి వంగపాటి సుబ్బమ్మ గారు
పరమపదించి తేది 24-07-2009 నాటికి ఏడాది గడుస్తుంది.
మరవలేని ఆమె మధుర స్మృతులను స్మరించుకొంటూ...
ప్రథమవర్ధంతి సందర్భముగా అశ్రునయనాలతో శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

భర్త : వంగపాటి నాగయ్య

కుమారులు - కోడళ్లు
వంగపాటి నాగరాజు - లీలమ్మ
వంగపాటి నాగమణి - అరుణమ్మ
వంగపాటి నాగేశ్వరరావు - శైలజ
శ్రీ లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్, నెల్లూరు.

కుమార్తెలు - అల్లుళ్లు
భాగం నాగమల్లేశ్వరి - చిన్నకాశయ్య
నేరెళ్ల నాగసుశీల - శ్రీనివాసులు
మరియు మనుమలు, మనుమరాళ్ళు

# 39వ డివిజన్‌లో లోపించిన పారిశుధ్యం

నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 39వ డివిజన్‌లో కొంతమేర అభివృద్ధి పనులు జరిగాయి. మునిసిపల్ కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి ఇప్పటివరకు దాదాపు 50 లక్షల వరకు వివిధ పనుల కోసం ఖర్చు చేయడం జరిగింది. ఈ నిధులతో సిసిరోడ్ల నిర్మాణం, డ్రైనేజి కాల్వల ఆధునీకరణ, త్రాగునీటి సరఫరా కోసం పైపులైను ఏర్పాటు, పార్కు అభివృద్ధి తదితర పనులు పూర్తి చేయడం జరిగింది. డివిజన్‌లో ఇంకా మిగిలిన పనులను పూర్తి చేసేందుకు నిధుల కొరత వుంది.

39వ డివిజన్ కార్పొరేటర్‌గా జరీనాసుల్తానా 2005 సంవత్సరంలో జరిగిన కార్పొరేషన్ ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు. అనంతరం కాంగ్రెస్ పార్టీకి మద్దతుదారుగా వుంటూ వచ్చారు. పాలకవర్గంలోని అధికారపక్షానికి సన్నిహితంగా వుండడం వలన డివిజన్ అభివృద్ధికి కొంతమేర నిధులు మంజూరు చేయించుకోగలిగారు. స్వతంత్ర కార్పొరేటర్‌గా ఎన్నికైనప్పటికి డివిజన్ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తూ వస్తున్నారు. ఇటీవల మేయర్‌గా భానుశ్రీ ఎన్నికైన తర్వాత ఆమెకు కొంత దూరంగా వుంటుంది కార్పొరేటర్.



**త్రాగునీటి పైపులను మార్చాలి!**

మా డివిజన్‌లో త్రాగునీటి పైపులు మరమ్మతులకు గురి కావడం వలన త్రాగు నీటి సరఫరా కోసం తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుంది. వీధులను ప్రతిరోజు శుభ్రం చేసే విధంగా కార్పొరేటర్, మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలి.

-మొహిద్దీన్



**డ్రైనేజి కాల్వలు శుభ్రం చేయాలి!**

కాల్వలను ప్రతి రోజు శుభ్రం చేయని కారణంగా చెత్త, చెదారం పేరుకుపోయి మురికినీరు నిల్వ వుంటుంది. దీంతో దోమలు చేరడంతో పాటు దుర్గంధభరితమైన వాసన వస్తుంది. స్థానిక కార్పొరేటర్, మునిసిపల్ అధికారులు స్పందించి కృషి చేస్తే బాగుంటుంది.

-అజీమున్నీసా

39వ డివిజన్ పరిధిలో కోటమిట్ట, పెద్దబజార్ సెంటర్, జెండావీధి వాటర్ ట్యాంకు తదితర ప్రాంతాలు వున్నాయి. 2వేల కుటుంబాలు, 5వేల మంది ఓటర్లు ఈ డివిజన్‌లో నివసిస్తున్నారు. ఈ డివిజన్‌లో కొంతమేర త్రాగునీటి సమస్య వుంది: ఇందుకు ప్రధానంగా పైపులైన్లు పగిలిపోవడం కారణమని చెబుతున్నారు స్థానికులు. కొన్ని ప్రాంతాలలోని పైపులైన్లను మార్చేందుకు అవాంతరాలు వున్నాయని, త్వరలో ఈ సమస్యను పరిష్కరించనున్నట్లు కార్పొరేటర్ చెప్పారు. గడిచిన మూడున్నర సంవత్సరాల కాలంలో డివిజన్ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేశానని ఆమె తెలిపారు.

పాలకవర్గం, మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు అన్నివిధాల డివిజన్ అభివృద్ధికి సహకరించినట్లు వివరించారు. ఈ క్రమంలో 39వ డివిజన్ జరిగిన అభివృద్ధి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్థానికులు వెల్లడించిన అభిప్రాయాలను తెలిపారు.



మురికి కాల్వలో మంచినీటి పైపులు



వీధుల్లో పేరుకపోయిన చెత్తా చెదారం

**అవినీతి కథ**

# ఆదర్శ రైతుల పేరిట నిధుల దుర్వినియోగం!




నెల్లూరులోని వ్యవసాయ సంచాలకుడి కార్యాలయం

ప్రభుత్వ ఉదాసీనత, వ్యవసాయశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం జరుగుతుంది. ఆదర్శ రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న గౌరవ వేతనం కారణంగా రైతులకు ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. మండల స్థాయిలో వ్యవసాయరంగంలో ఆధునిక సాంకేతిక పద్ధతులు పాటించి సాగుచేసి అధిక దిగుబడులు సాధించిన రైతులను ఆదర్శ రైతులుగా ఎంపిక చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులున్నాయి. అయితే ఈ ఎంపిక ప్రక్రియలో వ్యవసాయశాఖ అధికారులు నిబంధనలు పాటించలేదన్న ఆరోపణలున్నాయి.

అసలు ఆదర్శరైతు అనే పదానికి అర్థం మార్చేశారు అధికారులు. ధనవంతులు, రాజకీయ నేతలనే ఆదర్శ రైతులుగా ఎంపిక చేశారన్న విమర్శలు వున్నప్పటికీ వీటిని ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఆదర్శరైతులుగా ఎంపికైనవారు వ్యవసాయ శాఖ అమలుచేస్తున్న వివిధ పథకాలను గ్రామస్థాయిలో రైతులకు వివరించడం, ఏ ప్రాంతంలో ఏ సీజన్‌లో, ఏ పంటలు వేస్తే అధిక దిగుబడులు వస్తాయో అందుకు సంబంధించిన విత్తనాలను సబ్సిడీపై వ్యవసాయశాఖ ద్వారా రైతుకు సరఫరా చేయించడం, పురుగు మందులు, రసాయనిక ఎరువు ఎంత శాతం వాడాలో రైతుకు వివరంగా చెప్పడం వంటి బాధ్యతలను నిర్వర్తించాల్సి వుంటుంది.

అయితే ఆదర్శరైతులుగా ఎంపికైన వారు ఏ ప్రాంతంలో కూడా వ్యవసాయ రంగానికి సంబంధించిన సూచనలు, సలహాలు రైతులకు అందజేస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. వ్యవసాయ శాఖ నిర్వహిస్తున్న సభలు, సమావేశాలకు హాజరు కావడం తప్ప ఎటువంటి బాధ్యతలను నిర్వహించడం లేదు. ఆదర్శరైతుల వల్ల గ్రామీణ ప్రాంతాలలోని రైతులకు ఎటువంటి సహాయ, సహకారాలు అందడం లేదన్న విషయం మండలస్థాయి అధికారి నుంచి జిల్లాస్థాయి అధికారి వరకు అందరికీ తెలిసినా కూడా, వీటిని అధిగమించేందుకు ఎటువంటి కృషి చేయడం లేదు. ఫలితంగా వ్యవసాయ సాగులో మెళుకువలు తెలియక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

**ఆదర్శరైతుల వల్ల గ్రామీణ ప్రాంతాలలోని రైతులకు ఎటువంటి సహాయ, సహకారాలూ అందడం లేదన్న విషయం మండలస్థాయి అధికారి నుంచి జిల్లాస్థాయి అధికారి వరకు అందరికీ తెలిసినా కూడా, వీటిని అధిగమించేందుకు ఎటువంటి కృషి చేయడం లేదు.**

### 20 కోట్ల రూపాయల దుర్వినియోగం

జిల్లావ్యాప్తంగా ఆదర్శ రైతులుగా వ్యవసాయశాఖ 1700 మందిని ఎంపిక చేయడం జరిగింది. ఒక్కో ఆదర్శ రైతుకు నెలకు గౌరవ వేతనంగా వెయ్యి రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుంది. మొత్తం 1700 మంది ఆదర్శ రైతులకు కోటి 70 లక్షల రూపాయలు అవుతోంది. ఈవిధంగా సంవత్సరానికి దాదాపు 20 కోట్ల 40 లక్షల రూపాయలు ఆదర్శ రైతుల గౌరవ వేతనం కోసం ఖర్చవుతోంది. ఇన్ని కోట్ల రూపాయలు ఖర్చుచేస్తున్నా ఆదర్శ రైతుల వల్ల వ్యవసాయ శాఖకుగానీ, గ్రామీణ రైతులకు గానీ ఏ ఉపయోగం వుండడం లేదన్న విషయాన్ని ప్రభుత్వం గ్రహించలేక పోతోంది.

ఆదర్శ రైతులను ఎంపికచేసి ప్రతి నెల క్రమంతప్పకుండా గౌరవ వేతనం చెల్లించడం తప్ప వ్యవసాయశాఖ అధికారులకు వీరిపై ఎటువంటి అజమాయిషీ వుండదు. అలాగే ప్రభుత్వం అందజేస్తున్న గౌరవ వేతనాన్ని జేబులో వేసుకొని పత్తా లేకుండా పోతుంటారు ఆదర్శరైతులు. నెలకోసారి మండల స్థాయిలో, జిల్లా స్థాయిలో నిర్వహించే రైతు సమావేశాల్లో మాత్రమే తిరిగి దర్శనమిస్తుంటారు. ఆదర్శరైతుల వల్ల ప్రయోజనం చేకూరలేదన్న విషయం తెలిసినా కూడా వ్యవసాయశాఖ అధికారులు, ప్రభుత్వపరంగా ఇన్ని కోట్ల రూపాయల నిధులు ఎందుకు ఖర్చు చేస్తున్నారన్నది అర్థంకాని ప్రశ్న. మండలస్థాయిలో విధులు నిర్వహించే వ్యవసాయాధికారులు అసలు రైతులకు జరుగుతున్న నష్టాల గురించి ఆలోచన చేయడం లేదు.

ఆదర్శ రైతులకు ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తున్నారా? రైతులకు వరిసాగులో ఆధునిక, సాంకేతికపద్ధతులు పాటించే విధంగా సూచనలు, సలహాలు ఇస్తున్నారా? లేదా? అన్న విషయాలను పరిశీలించే బాధ్యత మండల వ్యవసాయ శాఖ అధికారిపై వుంటుంది. వీరి పనితీరు గురించి ఎప్పటికప్పుడు జిల్లాస్థాయి అధికారులకు నివేదికలు కూడా అందజేయాల్సి వుంటుంది. అయితే ఏ అధికారి కూడా తమకెందులే అన్న విధంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి కారకులవుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిధుల దుర్వినియోగంపై పర్యవేక్షణ చేసి ఆదర్శ రైతులను గాడిలో పెట్టాల్సిన అవసరం ఎంతైనా వుంది.



నెల్లూరు పెద్దాస్పత్రిలో రోగులకు పెడుతున్న అధ్వాన్న భోజనం.

## పెద్దాస్పత్రిలో భోజనం ఘోరం!

నానాటికి తీసికట్టు నాగంభట్టులా తయారయ్యింది నెల్లూరు పెద్దాస్పత్రి భోజనం వ్యవహారం. పెద్దాస్పత్రిలో భోజనం ఘోరంగా వుంటుందని రోగులేకాదు ఈ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి కూడా ఎప్పుడో తేల్చి చెప్పారు. కాని ఇక్కడ భోజనం సరఫరా చేసే కాంట్రాక్టర్ రాజకీయ పలుకుబడి వల్ల ఇప్పటివరకు ఈ భోజన కాంట్రాక్ట్‌ను రద్దుచేయలేకపోతున్నారు. పెద్దాస్పత్రిలో చికిత్స పొందే రోగులకు ఉదయం టిఫిన్ లేదా పాలు, రొట్టె అందజేయాలి. మధ్యాహ్నం 600 గ్రాములు, రాత్రి 450 గ్రాముల అన్నం, వాటితోపాటు కూర, సాంబారు, రసం, మజ్జిగ కూడా అందజేయాలి. కాని ఈ మధ్య అయితే ఉడికీ ఉడకని రేషన్ బియ్యంతో అన్నం, రేట్లు పెరిగాయని నీళ్ల సాంబార్, నీళ్ల మజ్జిగ పోసి సరిపెట్టేస్తున్నారు. వాస్తవానికి రోగులకు పోషకాహారం పెట్టాలి. జడ్పీఛైర్మన్ చొరవతో నెల్లూరులోని జూబ్లీ, క్షయాస్పత్రులలో రోగులకు ఇస్కాన్ సంస్థ లాభాపేక్ష లేకుండా మంచి భోజనం సరఫరా చేస్తున్నది. పెద్దాస్పత్రిలో కూడా ఈ సంస్థ భోజనం పెట్టేలా చూసేందుకు ఎవరు అడ్డం పడుతున్నారో అర్థమే కావడం లేదు. మొత్తం మీద గతవారం పదిరోజులుగా పెద్దాస్పత్రిలో రోగులకు పెడుతున్న నాసిరకం భోజనం కుక్కలు కూడా ముట్టవని చెప్పక తప్పదు.



నెల్లూరు ఎమ్మార్వో కార్యాలయంలో పంపిణీకి నోచుకోని ఓటరు ఐడెంటిటీ కార్డులు.

## పంపిణీకి నోచుకోని కార్డులు!

ఓటరు గుర్తింపు కార్డులు, పింక్ రంగు రేషన్‌కార్డులు పంపిణీకి నోచుకోకుండా నెల్లూరు ఎమ్మార్వో కార్యాలయంలో గుట్టలుగుట్టలుగా పడివున్నాయి. మార్చినెలలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని ఓటర్లకు గుర్తింపు కార్డులు జారీ చేయమని ఎన్నికల సంఘం ఆదేశించింది. గుర్తింపు కార్డులకు అవసరమైన ఫోటోలు తీయను ఫోటోగ్రాఫర్లను కొత్తగా నియమించారు. ఈ కార్డుల తయారీకి లక్షలాది రూపాయలు వెచ్చించినా వేలాది కార్డులు అంతిమంగా పంపిణీ చేయలేదు. నెల్లూరు ఎమ్మార్వో కార్యాలయంలో ఈ కార్డులు కుప్పలు తెప్పలుగా పడివున్నాయి. ఎన్నికలు అయ్యాయని ఊరుకోకుండా ఈ కార్డులను పంపిణీ చేస్తే ప్రయోజనముంటుంది.

పంపిణీకి ఏ మాత్రం అభ్యంతరం లేని గులాబీరంగు రేషన్‌కార్డులను కూడా రెవిన్యూ అధికారులు పంపిణీ చేయడం లేదు. రేషన్‌కార్డుల పరిశీలన జరుగుతున్నందున ఇప్పుడిప్పుడే వీటి పంపిణీ జరిగే సూచనలు కనపడడం లేదు. కార్డులు సిద్ధం చేసి పంపిణీ చేయకపోవడం వల్ల కార్డులు తయారీ లక్ష్యం దెబ్బతినిపోయింది.



నెల్లూరు టౌన్‌హాల్‌లో జరిగిన సిపిఎం జనరల్‌బాడీ సమావేశంలో మాట్లాడుతున్న ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బి.వి.రాఘవులు.

## సహకార సేద్యం ప్రమాదం

రాష్ట్ర ముఖ్యమంత్రి పదే పదే చెప్తున్న సహకార సేద్యం రైతాంగానికి ప్రమాదకరపోకడని సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వి.రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు. నెల్లూరు టౌన్‌హాల్‌లో 19తేది జరిగిన పార్టీ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్పొరేట్ సంస్థల వద్ద 1874 కోట్లకు అమ్ముడుపోయిన రాష్ట్ర ప్రభుత్వం సంస్కరణల పేరుతో ప్రజలను దోపిడీ చేస్తున్నదని నిప్పులు చెరిగారు. దానిలోభాగమే సహకార సేద్యం అమలు చేయాలన్న నిర్ణయం అన్నారు. మినరల్ వాటర్ పంపిణీ, రెండు రూపాయలకు కిలో బియ్యం వంటి పథకాలన్నీ ఈ

**ఒకవైపు ఆర్థికమాంద్యం కారణంగా యువత ఉపాధి, ఉద్యోగావకాశాలు కోల్పోయి రోడ్డున పడుతుంటే, కార్పొరేట్ కంపెనీలతో కుమ్మక్కవుతున్న ప్రభుత్వం ప్రజల బాగోగులు పట్టించుకోవడం లేదని సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బివి రాఘవులు ఆరోపిస్తున్నారు.**

కుయుక్తులలో భాగమేనని ఆరోపించారు. మొన్నటి ఎన్నికల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రపంచ బ్యాంకుతో లోపాయికారి ఒప్పందం చేసుకొని ఆ షరతులకు అనుగుణంగా పని చేస్తున్నదని విమర్శించారు. ఒకవైపు ఆర్థికమాంద్యం కారణంగా యువత ఉపాధి, ఉద్యోగావకాశాలు కోల్పోయి రోడ్డున పడుతుంటే, కార్పొరేట్ కంపెనీలతో కుమ్మక్కవుతున్న ప్రభుత్వం ప్రజల బాగోగులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ ధనాన్ని కాంగ్రెస్ నాయకులు దిగమింగినందువల్ల ప్రాజెక్టుల నిర్మాణం ఆగిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం సహాయం చేస్తే తప్ప వీటి నిర్మాణం అనుమానమేనన్నారు. సోమశిల జలాలను ముఖ్యమంత్రి పరిశ్రమలకు తరలిస్తే ఊరుకొనేది లేదన్నారు. ప్రభుత్వ వ్యతిరేకత ప్రజల్లో రావాలని, వారి ద్వారానే పోరాటాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు భానురాజు, జక్కా వెంకయ్య, మాదాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.




## విద్యార్థులకు రాజీవ్‌భవన్ చేయూత!

పేద విద్యార్థులకు వున్నత విద్యను అందించేందుకు రాజీవ్‌భవన్ చేయూతనిస్తుందని కాంగ్రెస్‌పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పి.అనిల్‌కుమార్ యాదవ్ చెప్పారు. పదవ తరగతిలో మంచి మార్కులు తెచ్చుకొన్న విద్యార్థినీ విద్యార్థులకు 19తేది బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలతో నిమిత్తం లేకుండా సేవ చేయాలన్న తలంపుతో విద్యార్థులకు రాజీవ్‌గాంధీ ప్రతిభా పురస్కార్ అవార్డులిస్తున్నట్లు చెప్పారు.

ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో నగరంలోని వివిధ ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఇటీవల ఐఎఎస్‌కు ఎంపికైన బుడిగి శ్రీనివాసులురెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ ఎస్వీఎల్.నారాయణరావు, లాయర్ పత్రిక ఎడిటర్ తుంగా శివప్రభాత్‌రెడ్డి, కార్పొరేటర్లు తాటి వెంకటేశ్వర్లు, రూప్‌కుమార్, స్వర్ణా వెంకయ్య తదితరులు పాల్గొన్నారు. రాజీవ్‌భవన్ ప్రారంభోత్సవం తర్వాత జరిగిన మొదటి కార్యక్రమం రాజీవ్‌గాంధీ ప్రతిభా పురస్కార్ అవార్డుల పంపిణీ కావడం విశేషం.

## చిరంజీవి విఫలం

నటుడిగా, కథానాయకుడిగా చిరంజీవి విజయం సాధించాడు, కానీ రాజకీయాలలో మాత్రం ఆయన వైఫల్యం చెందాడని సీనియర్ నటుడు పద్మనాభం వ్యాఖ్యానించారు. నగరానికి 18తేది విచ్చేసిన ఆయన సినీనటులు రాజకీయ ప్రవేశంపై వైవిధంగా మాట్లాడాడు. ఎన్‌టిరామారావుకు సాటి సినీ, రాజకీయ రంగంలో ఎవరూలేరు. సినిమాలలో ప్రేక్షకుల మనసు గెలుచుకొని ఆయన రాజకీయాలలోకి ప్రవేశించి ఎన్నో సంస్కరణలు చేపట్టి రాష్ట్ర ప్రజల హృదయాలను గెలుచుకొన్నాడు. ప్రజారాజ్యం పార్టీ స్థాపించిన చిరంజీవి పరిస్థితి వేరు. ఆయనకు రాజకీయలపట్ల, ప్రజాసమస్యల పట్ల కనీసపాటి అవగాహన లేకపోవడం వల్లనే ఓడిపోయారని వ్యాఖ్యానించాడు.

# వరాలు బారెడు-వనరులు మూరెడు

రాష్ట్రానికి సూర్యగ్రహణం గండం తప్పిందనుకుంటే మరోవైపు ఖజానాకు సంపూర్ణ గ్రహణం ముప్పు ముంచుకొస్తోంది. రాబడి తగ్గి ఖర్చులు పెరిగిపోతుండటంతో ఏం చేయాలో పాలుబోక ఆర్థికశాఖ అధికారులు మొత్తుకుంటున్నారు. శాసనసభ సమావేశాల్లో ఈ ఏడాది పూర్తికాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టాల్సివుంది.



ఎన్నికల కారణంగా ఇప్పటిదాకా ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్‌తోనే నెట్టుకువస్తున్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వైయస్ ప్రకటించిన సంక్షేమ పథకాలు, సబ్సిడీలు, రాయితీలు తడిసి మోపెడవుతున్నాయి. ఆదాయం బాగా తగ్గిపోవడంతో నిధుల్లేక అన్నిశాఖల పద్దుల్లో భారీ కోత తప్పడంలేదు. వైయస్ ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న జలయజ్ఞం, వివిధ వర్గాలకిచ్చిన సబ్సిడీలు రాహు-కేతువుల్లా ఖజానాను మింగేస్తున్నాయి. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర సాయంకోసం చకోర పక్షిలా ఎదురుచూస్తోంది. రాష్ట్ర అవసరాలకు సరిపడా నిధులిచ్చి ఆదుకోవాలంటూ 13వ ఆర్థిక సంఘం ఎదుట మోకరిల్లుతోంది.

ఆర్థిక మాంద్యం కారణంగా రియల్‌ఎస్టేట్ తదితర రంగాలు చతికిల బడటంతో ఆదాయానికి గండి పడుతోంది. మరో పక్క ఖర్చులేమో పెరిగిపోతున్నాయి. యేటా సబ్సిడీల భారం 50వేల కోట్ల రూపాయలు దాటిపోయింది. లక్ష కోట్ల రూపాయల బడ్జెట్‌లో సగం మొత్తం సబ్సిడీలకు పోవడంతో ఉత్పాదకత మూలబడింది. దీనికి తోడు జలయజ్ఞానికి కోటానుకోట్ల రూపాయలు కేటాయించాల్సివుంది. 2013 డిసెంబర్ చివరినాటికి నిర్మాణంలో వున్న నీటిపారుదల ప్రాజెక్టులన్నింటినీ పూర్తిచేసి తీరతామని వైయస్ చెబుతున్నాడు. అయితే ప్రాజెక్టుల కేటాయింపుల్ని చూస్తే పరిస్థితి మరోలా వుంది. సబ్సిడీలకు ఇతర అవసరాలకు పోను మిగిలిన చిల్లర డబ్బులు ప్రాజెక్టులకు కేటాయించడం వల్ల ఒరిగేదేంలేదు. కేంద్ర ప్రభుత్వం కనికరించి ఆదుకుంటే తప్ప ఈ ప్రాజెక్టులు పూర్తికావడం అనుమానమే. ఇటీవల హైదరాబాదుకు వచ్చిన 13వ ఆర్థిక సంఘం సభ్యులు జలయజ్ఞంలో నిధులు దుబారా అవుతున్నాయని విమర్శించిన నేపథ్యంలో కేంద్రసాయం అందడం అంతమాత్రమేనని అంటున్నారు.

వైయస్ గొప్పగా చెబుతున్న ఆరోగ్యశ్రీ పథకం నిధుల్లేక కునారిల్లుతోంది. బిల్లుల చెల్లింపు

కొరవ 14వ పేజీలో

## డిసిసి విధుల్లో నీళ్ల అమ్మకమూ వుందా?

కండ్లేరు రిజర్వాయర్ నుంచి అంకులపాటూరులో కొత్తగా నిర్మించిన ఎస్‌బిటి స్టీల్ ఫ్యాక్టరీకి 0.2 టిఎంసిల నీళ్లు విడుదల చేశారు తెలుగుగంగ అధికారులు. వెంకటగిరి నియోజకవర్గంలోని వెలికల్లు ఎస్కేప్ కాలువ ద్వారా కైవల్యానదికి తెలుగుగంగ నీళ్లు వదలి, అక్కడనుంచి తిక్కవరం చెరువుకు ప్రవహింపచేశారట. ఆ చెరువు నుంచి ఫ్యాక్టరీకి మోటార్ల ద్వారా తరలిస్తున్నారట. 0.2 టిఎంసిల నీళ్లంటే, ఆరుతడి పంటల సాగు పద్ధతిలో నాలుగువేల ఎకరాలకు సరిపోతాయి. అసలే కరువు ముంచుకొని వస్తున్న సమయంలో ఇంత భారీ మొత్తంలో నీటిని ఫ్యాక్టరీకి ఇవ్వడానికి అధికారులకు ఎంత సాహసం కావాలి?

ఈ ఫ్యాక్టరీ యాజమాన్యంతో డిసిసి అధ్యక్షుడు ఎల్లసిరి గోపాలరెడ్డికి సన్నిహిత సంబంధాలున్నాయి. వారి కార్యాలయం ఆయన ఇంట్లోనే బాడుగకు వుంది. ఫ్యాక్టరీ పరిధిలో జరిగే చాలా పనులకు ఆయనే కాంట్రాక్టర్. ఆయనిప్పుడు జిల్లామంత్రి ఆనం

కొరవ 14వ పేజీలో






ఉత్తరక్రియలు

జాతస్య హి ధ్రువో మృత్యు ర్ధ్రువం జన్మ మృతస్య చ।
తస్మా దపరిహార్యే ర్థే న త్వం శోచితుమర్హసి॥

అనురాగానికి ప్రతిరూపంగా, ఆత్మీయతకు వుపమానంగా
తన మనసులోని తియ్యదనాన్ని మా అందరికి పంచి,
లాలించి, పాలించి మా హృదయాలలో ప్రేమ పుష్పాలు పూయించిన
అమృతమూర్తి శ్రీమతి మారు సరోజనమ్మగారు
తేది 15-07-2009 బుధవారం నాడు భగవత్ సాన్నిధ్యానికి చివికేగారు.
ఆ చల్లటి తలపులు మా గుండెలలో కోవెలగంటల వలె సవ్వడి చేస్తూనే ఉంటాయి.

: పెద్దకర్మ :
తేది 28-07-2009 మంగళవారం రాత్రి "శిలాప్రతిష్ఠ"
తేది 29-07-2009 బుధవారం "బ్రాహ్మణ బియ్యాలు"
వంటపాలెంలోని మా స్వగృహము నందు జరుగును.
బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

కుమారులు - కోడళ్లు
మారు వెంకటరామిరెడ్డి - పద్మావతమ్మ
మారు సుందరరామిరెడ్డి - శారద
మారు సుధాకరరెడ్డి - సునీల

కుమార్తెలు - అల్లుళ్లు
కాటంరెడ్డి శేషమ్మ - దశరధరామిరెడ్డి
వాకాటి కనకమ్మ - మల్లిఖార్జునరెడ్డి

మనుమరాళ్లు: శ్రీలత, విజిత, అనిత, మమత, అపర్ణ, సుప్రియ, సింధు, రమ్య
మనుమలు: కాటంరెడ్డి పట్టాభిరామిరెడ్డి, మారు రోహిత్‌రెడ్డి


Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.